# శిథిలావస్థలో మార్కెట్ భవనం

ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, వినియోగదారులు

- అటకెక్కిన అమీర్‌పేట మల్టీమోడల్ మార్కెట్ ప్రతిపాదనలు
- ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలంటున్న స్థానికులు

**బేగంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** లైవ్ చేపలు, మటన్, నాటుకోడి మాంసానికి అమీర్‌పేట మున్సిపల్ మార్కెట్ ఎంతో ప్రసిద్ధి. ఆదివారం వచ్చిందంటే నాన్‌వెజ్ ప్రియులతో మార్కెట్ కిటకిటలాడుతుంది. ఈ మార్కెట్ ఎంతోమందికి ఉపాధి సైతం కల్పిస్తోంది. అయితే ప్రస్తుతం ఈ మార్కెట్ భవనం శిథిలావస్థకు చేరింది. దీని స్థానంలో నూతనంగా మల్టీ మోడల్ మార్కెట్ నిర్మించాలని ఉమ్మడి ఏపీలోని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రయత్నాలు జరిగినా అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి.ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిపై దృష్టి సారించలేదు. ఎంసీహెచ్ మార్కెట్ స్థానంలో మల్టీ మోడల్ మార్కెట్‌ను నిర్మిస్తే ఈ ప్రాంతంలో పార్కింగ్ సమస్య తీరడంతో పాటు వందలాది మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇక్కడ మల్టీ మోడల్ మార్కెట్‌ను నిర్మించాలని వారు కోరుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఇక్కడ ఉన్న ఖాళీ స్థలాన్ని కొందరు కబ్జాకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు.



చేపల విక్రయాలు

### 58 సంవత్సరాల చరిత్ర

1966 ఆగస్టు 19న అప్పటి లేబర్, ట్రాన్స్‌పోర్టు మంత్రి బీవీ గురుమూర్తి 1800 గజాల స్థలంలో మున్సిపల్ మార్కెట్ భవనాన్ని నిర్మించి ప్రారంభించారు. ఓ వైపు తాజా కూరగాయల బండ్ల కోసం స్థలాన్ని కేటాయించారు. మరో వైపు మాంసాహార ఉత్పత్తులు, ఇంకో వైపు నిత్యావసర వస్తువుల విక్రయాల కోసం 44 షాపులను ఏర్పాటు చేశారు. ఏ వస్తువు కావాలన్నా అప్పట్లో ఈ ప్రాంతవాసులు ఈ మార్కెట్‌కు వచ్చి కొనుగోలు చేసేవారు. ఆదివారం, పండుగల సమయంలో మార్కెట్ కిక్కిరిసిపోయేది.



శిథిలావస్థకు చేరిన అమీర్‌పేట ఎంసీహెచ్ మార్కెట్ భవనం

### ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

అమీర్‌పేటలో పాత మార్కెట్‌ను తొలగించి దీని స్థానంలో మల్టీమోడల్ మార్కెట్‌ను నిర్మించాలని గతంలో నిర్ణయించినా ఆ ప్రయత్నాలు కార్యరూపం దాల్చలేదు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే దానం నాగేందర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా. ఇప్పటికే ఈ విషయంపై స్థానికుల నుంచి అభిప్రాయాలను సేకరించాం.

- వనం సంగీతాయాదవ్, సోమాజిగూడ కార్పొరేటర్

### చిన్నపాటి వర్షానికే ఇబ్బందులు

అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రస్తుతం ఈ మార్కెట్ ఉనికి కోల్పోతోంది. మొదట్లో ఇక్కడ కూరగాయలు, మటన్, చికెన్‌తో పాటు అన్ని రకాలు వస్తువులు అందుబాటులో ఉన్నా కాలక్రమేణా ఇది నాన్ వెజ్ మార్కెట్‌గా మారింది. ఉమ్మడి ఏపీలో మంత్రిగా ఉన్న దానం నాగేందర్ ఇక్కడ మల్టీమోడల్ మార్కెట్ నిర్మించాలని యోచించారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరడంతో చిన్నపాటి వర్షానికే షాపుల్లోకి నీరు వస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా వచ్చి అద్దె తీసుకుని వెళ్తున్న మార్కెట్ ఎస్టేట్ సిబ్బంది పారిశుధ్యంతో పాటు ఇతర సమస్యలపై దృష్టి సారించడం లేదని వారు చెబుతున్నారు.




1966లో వేసిన శిలాఫలకం

## లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన

**బంజారాహిల్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** మెగా లోక్ అదాలత్‌కు అనూహ్య స్పందన లభించింది. ఫిర్యాదుదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు న్యాయమూర్తి ఎదుట రాజీ ఒప్పందం కుదుర్చుకోవడంతో పశ్చిమ మండలం పరిధిలో 1,638 కేసులు పరిష్కారమయ్యాయి. ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసులను లోక్ అదాలత్‌తో రాజీ మార్గం ద్వారా పరిష్కారం చేసుకునే వేసులుబాటు ఉంటుంది. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో సైతం ఫైన్‌తో బయటపడే అవకాశం ఉంటుంది. దీంతో పోలీసులు ఈ తరహా కేసుల్లో ఇరు వర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం వారి ఇష్టప్రకారం లోక్ అదాలత్‌లో రాజీకి ప్రయత్నిస్తారు. కాగా, ఈ నెల 13, 14 తేదీల్లో లోక్ అదాలత్‌లో పశ్చిమ మండల పరిధిలోని పంజాగుట్ట ఠాణాలో 288, బంజారాహిల్స్‌లో 227, జూబ్లీహిల్స్‌లో 234, సంజీవరెడ్డినగర్‌లో 246, మధురానగర్‌లో 210, ఫిలింనగర్ 191, బోరబండ పోలీసుస్టేషన్ పరిధిలో 242 కేసులు పరిష్కారమయ్యాయి.



ఆదర్శ్ జూనియర్ కళాశాల వద్ద పర్యవేక్షిస్తున్న అడిషనల్ డీసీపీ కృష్ణగౌడ్

## ప్రశాంతంగా మొదటి రోజు గ్రూప్-2 పరీక్షలు

**అమీర్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఆదివారం గ్రూప్-2 మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎస్ఆర్‌నగర్‌లోని ఆదర్శ్ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు ప్రారంభమైన మొదటి షిఫ్ట్ పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటలకు.. రెండవ షిఫ్ట్ 3 గంటలకు ప్రారంభమై 5.30కి ముగిసింది. ఇక్కడి సెంటర్‌లో మొత్తం 450 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకుండా వెస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ కృష్ణగౌడ్, ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి సాయంత్రం వరకు పర్యవేక్షించారు.



ఫిట్‌నెస్ ట్రైనర్ సౌరబ్ భోత్రాకు మెమెంటో అందజేస్తున్న జీతో లేడీస్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు

## యోగాతో ఆరోగ్య ప్రయోజనాలు

**బంజారాహిల్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** యోగాతో కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు అవగాహన కలిగించేందుకు జీతో లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కేబీఆర్ పార్కు, సంజీవయ్య పార్కు వద్ద 'యోగాతో ఆరోగ్యం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ ట్రైనర్ సౌరబ్ భోత్రా మాట్లాడుతూ.. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతిరోజూ అరగంట పాటు యోగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు.



ఎల్లమ్మ ఆలయం వద్ద తలసాని సాయికిరణ్‌యాదవ్ తదితరులు

## ఎల్లమ్మను దర్శించుకున్న తలసాని సాయికిరణ్

**అమీర్‌పేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ తలసాని సాయికిరణ్‌యాదవ్ ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ఇంటి ఇలవేల్పు ఎలమ్మ తల్లి అన్నారు. మాలధారణ తర్వాత అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, కేబుల్ శివ, కట్టా బలరాం, రామేశ్వరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలోని ఓ సన్నివేశం

## ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

**ఖైరతాబాద్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** ఖైరతాబాద్‌లోని లేమన్స్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ (ఎల్ఈఎఫ్) చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ (క్రిస్మస్ క్యారల్స్) వేడుకలు సందడిగా జరిగాయి. క్రీస్తును ఆరాధిస్తూ చిన్నారులు, యువత భక్తిగీతాలను ఆలపించారు. ఒకే రకమైన దుస్తులు ధరించి చేసిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ సందర్భాన్ని వివరించే నాటకం, వ్యక్తి జీవితం చెడు నుంచి మంచి వైపునకు మళ్లించే నాటకం, యువకుల షాడో ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. అతిథిగా హాజరైన పాస్టర్ ప్రియనాథ్ బైబిల్ ఆధారంగా క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు.

## యాసిడ్ తాగి యువకుడి ఆత్మహత్య



సాయికృష్ణ(ఫైల్)

**బిట్స్‌పిలానీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు యాసిడ్ తాగి ఆత్మహత్య చేసుకున్న జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బీజేఆర్ నగర్ జమ్మిగడ్డలో వెంకటేశ్ భార్య, ముగ్గురు కుమారులతో కలిసి ఉంటున్నాడు. పెద్ద కుమారుడు సాయికృష్ణ(18) తన చిన్న తమ్ముడు రాకేష్‌తో సెల్‌ఫోన్ విషయమై గొడవపడ్డాడు. దీంతో తండ్రి మందలించడంతో సాయికృష్ణ శనివారం సాయంత్రం యాసిడ్ తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జవహర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో అత్త, మరదలిపై దాడి

**యూసుఫ్‌గూడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** మద్యం మత్తులో అత్త, మరదలిపై దాడి చేసిన వ్యక్తిపై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జవహర్‌నగర్‌కు చెందిన కె.సునీత శనివారం రాత్రి సమీపంలోని దేవాలయానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి ఆమె బావ రాజు మద్యం మత్తులో అత్తని, ఆమె పిల్లల్ని కొడుతున్నాడు. దీంతో సునీత అడ్డు వెళ్లి ప్రశ్నించడంతో సునీతను సైతం అసభ్యంగా తిడుతూ కొట్టాడు. ఈ విషయం తెలిసిన ఆమె భర్త శ్రీనివాస్ ఎందుకు ఇలా చేస్తున్నావని ప్రశ్నించగా 'నీ అంతు చూస్తా' అంటూ దాడిచేసే ప్రయత్నం చేశాడు. దీంతో బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రైల్వే ప్రహరీ మూసివేత

- ఆందోళనకు దిగిన ఎంఎస్ మక్తా ప్రాంత వాసులు
- సమస్య పరిష్కారానికి కార్పొరేటర్, ఎమ్మెల్యే హామీ

**బేగంపేట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** రైల్వే లైన్ ప్రాంతాల్లో ప్రహరీలకు ఉన్న ఖాళీలను అధికారులు మూసివేస్తున్నారు. అందులో భాగంగా బ్రాహ్మణవాడి నుంచి కుందన్‌బాగ్ వేళ్లే దారిలో, సోమాజిగూడ డివిజన్‌లోని ఎంఎస్ మక్తా నుంచి నెక్లెస్ రోడ్డు వెళ్లే దారిలో రైల్వే పట్టాల వద్ద ప్రహరీగోడకు ఉన్న ఖాళీలను మూసివేశారు. దీంతో ఎంఎస్ మక్తా ప్రాంత వాసులు సమీపంలోని సోమాజిగూడ, నెక్లెస్‌రోడ్డు వైపు వెళ్లాలంటే 3 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు కార్పొరేటర్ వనం సంగీతా యాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె రెండు రోజుల క్రితం రైల్వే ఉన్నతాధికారులను కలిసి సమస్యను వివరించారు. అనంతరం రైల్వే అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి సమస్య గురించి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా రైల్వే అధికారులు బస్తీవాసులకు హామీ ఇచ్చారు. అయినా గోడను తొలగించకపోవడంతో ఆదివారం బస్తీ వాసులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. గోడను కూల్చివేసేందుకు ప్రయత్నించగా కార్పొరేటర్ వారికి నచ్చజెప్పి సమస్యను ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు వివరించారు. స్పందించిన దానం త్వరలో సమస్యను పరిష్కరిస్తానని ఫోన్‌లో హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులతో పాటు కాంగ్రెస్ నాయకులు వనం శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



ఎంఎస్ మక్తాలో మూసివేసిన రైల్వే గోడ ప్రాంతాన్ని స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత వనం శ్రీనివాస్‌యాదవ్

# తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తులు బాపూ, రమణ

- ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి

**బంజారాహిల్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తులు బాపూ, రమణలు అని మాజీ ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి అన్నారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో బాపూరమణ అకాడమీ ఆధ్వర్యంలో బాపూరమణ-2024 పురస్కారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేవీ రమణాచారి మాట్లాడుతూ.. ఒకరు చిత్రకారుడిగా, మరొకరు రచయితగా ఉన్నప్పటికీ భిన్నత్వంలో ఏకత్వంలా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా బాపూరమణ జీవితకాల సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ సినీ రచయిత ఆకెళ్ల వెంకట సూర్యనారాయణకు అందజేశారు. కార్టూనిస్ట్ సురేంద్రకు బాపూ పురస్కారం అందజేశారు. అనంతరం కార్టూనిస్ట్ గాంధీ రచించిన మనోహరాల గాంధీ కార్టూన్ల సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల, సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్, నటుడు ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.



బాపూరమణ జీవిత సాఫల్య పురస్కారాన్ని సినీ రచయిత ఆకెళ్ల వెంకట సూర్యనారాయణకు అందజేస్తున్న కేవీ రమణాచారి తదితరులు

# ఇంధన పొదుపుపై అవగాహన పెరగాలి

- టీజీ రెడ్కో మేనేజింగ్ డైరెక్టర్ అనిలా వావిల్లా

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** ఇంధన పొదుపుపై ప్రతి ఒక్కరిలో అవగాహన రావాలని టీజీ రెడ్కో మేనేజింగ్ డైరెక్టర్ అనిలా వావిల్లా అన్నారు. జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలు-2024లో భాగంగా టీజీ రెడ్కో ఆధ్వర్యంలో ఆదివారం ఖైరతాబాద్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ భవనం నుంచి ఎన్టీఆర్ మార్గ్ వరకు నిర్వహించిన ఇంధన సంరక్షణ వాక్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థిరమైన భవిష్యత్తు కోసం ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్‌ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఒక్క విద్యుత్ యూనిట్ ఆదా చేస్తే రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానమని, పర్యావరణ పరిరక్షణకు టీజీ రెడ్కో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గీత రచయిత అనంత శ్రీరాం, ఐఈఐ టీఎస్‌సీ చైర్మన్ డా.జి.వెంకట సుబ్బయ్య, టీజీ రెడ్కో ఉద్యోగులు, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.




ఖైరతాబాద్‌లో ఎనర్జీ వాక్‌ను ప్రారంభిస్తున్న టీజీ రెడ్కో, ఎండీ అనిలా వావిల్లా

## వైభవంగా అయ్యప్పస్వామి గజారోహణం





శ్రీనగర్ కాలనీ వెంకటేశ్వరస్వామి ఆలయంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం గజారోహణం కనులపండువగా జరిగింది. ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, గణపతి హోమం నిర్వహించారు. అనంతరం శబరిమల తరహాలో జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 5 నుంచి స్వామి వారికి ఆభరణాల ఊరేగింపు నిర్వహించారు. ఈ నగలకు గద్ద కాపలా రావడంతో భక్తులు పరవశించిపోయారు. గజారోహణ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

- బంజారాహిల్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి)



పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ

**యూసుఫ్‌గూడ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని వెంకటగిరిలో ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అయ్యప్పమాలధారులకు అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి, జూబ్లీహిల్స్ కన్వీనర్ కుంబాల గంగరాజు, నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, ఫానిల్, మోహన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అయ్యప్ప మాలధారులకు పూజా సామగ్రి అందజేసిన కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

## అయ్యప్ప మాలధారులకు పూజా సామగ్రి అందజేత

**బోరబండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** దైవ భక్తితో మానసిక ప్రశాంతత కలుగుతుందని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. డివిజన్ పరిధిలోని అయ్యప్ప మాలధారులకు ఆయన పూజా సామగ్రితో కూడిన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, మహేందర్ గౌడ్, మాలధారులు బబ్లూ, బాలు, ఓంకార్, పవన్, నాని, పూర్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం శనివారం రాత్రి లంబగుడ్డు చిల్లాలో ప్రార్థనలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

## భారతీయులను ఐక్యంగా ఉంచేది రాజ్యాంగమే

- సీపీఎం నేత బీవీ రాఘవులు

**రాంనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి):** భారతీయులు విశ్వమానవులని, వారిని ఒక్కటిగా ఉంచగలిగింది రాజ్యాంగమేనని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సీనియర్ నాయకుడు అక్షయకుమార్‌దత్ సంస్మరణ సభను టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాఘవులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే, బీజేపీ రాజ్యాంగాన్ని విధ్వంసం చేస్తోందని ఆరోపించారు. ప్రపంచంలో ఎలక్టోరల్ డిక్టేటర్‌షిప్ అనే కొత్త సంస్కృతి తెరపైకి వచ్చిందని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక నియంతృత్వానికి దారి తీస్తుందన్నారు. లౌకికవాదం, సమాఖ్యవాదం, సామాజిక న్యాయం, సామ్యవాదాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

## నేడు రైల్వే పెన్షన్ అదాలత్

చిలకలగూడ, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): రైల్వే పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సోమవారం పెన్షన్ అదాలత్ నిర్వహించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. సికింద్రాబాద్, రైల్ నిలయంలో ఉదయం 10గంటలకి నిర్వహించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, కార్మిక సంఘ నాయకులు, పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొననున్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న పులి కల్పన

## అంబేడ్కర్ అడుగు జాడలో నడుద్దాం: పులికల్పన

అడ్డగుట్ట, బౌద్ధనగర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ అడుగుజాడలో నడిచి సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన అన్నారు. ఆదివారం తుకారాంగేట్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం గ్రేటర్ కన్వీనర్ ఉమక్క, సుజాత, పార్వతి, కవిత, స్వాతి, రోజీ పాల్గొన్నారు. ప్రతి ఆదివారం అంబేడ్కర్‌కు జ్ఞాన మాలవేసి వేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. నాల్గవ వారం సీతాఫల్‌మండిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు.

# రోడ్లు శుభ్రం.. బతుకు ఛిద్రం

### అగమ్యగోచరంగా పారిశుధ్య కార్మికుల జీవితాలు

- చాలీచాలని వేతనాలతో కుటుంబపోషణ భారం
- ఏళ్లుగా పనిచేస్తున్నా పర్మినెంట్‌కాని కొలువులు
- ప్రభుత్వాలు, పాలకులు మారినా పట్టించుకోని వైనం



చెత్తను ఎత్తుతున్న పారిశుధ్య కార్మికులు




వీధుల్లో శుభ్రంచేసిన చెత్తను రిక్షాలో తీసుకువెళ్తున్న జీహెచ్‌ఎంసీ కార్మికులు

బోయిన్‌పల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎండైనా.. వానైనా.. ఎముకలు కొరికే చలిలోనైనా వారి సేవలు కొనసాగుతూనే ఉంటాయి. తెల్లవారు జామునే వారు విధుల్లోకి చేరి, రోడ్లన్నీ శుభ్రంచేసి మురుగును ఎత్తుతూ వారి జీవితాలు దుర్వాసనలో ఛిద్రమౌతున్నా పాలకులు మాత్రం వీరిని పట్టించుకోవడంలేదు. మనం నిద్రనుండి మేలుకోకముందే రోడ్లన్నీ శుభ్రంచేస్తున్న ఈ మట్టి మనుషులు మాత్రం అన్నీ కష్టాలే ఎదుర్కొంటున్నారు. చెత్తపై కొత్త సమరం అంటూ స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుతో అటు క్రికెటర్లు, సినిమా యాక్టర్లతో అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు కోటీశ్వరులు చీపుర్లుపట్టి రోడ్లను ఊడుస్తూ దేశపౌరుల సామాజిక బాధ్యతను గుర్తుచేస్తున్నారు. అసలే చాలీచాలని వేతనాలు.. అవి కూడా రెండు మూడు నెలలకు ఒకసారి వస్తుండడంతో ఈ కార్మికుల బాధలు అన్నీ ఇన్నీ కావు. ఇచ్చిందే పైకం.. వచ్చిందే జీతంగా సౌకర్యాలకు దూరమై దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. అటు గ్రామాలతో పాటు పట్టణాల్లో పంచాయతీలలో మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లలో కంటోన్మెంట్ బోర్డు పరిధిలో పారిశుధ్య కార్మికులు ఏళ్ల తరబడి రెక్కలు ముక్కలు చేసుకున్నా గుర్తించేవారు లేకుండా పోతున్నారు.

### జనమంతా నిద్రలో..

జనమంతా గాఢ నిద్రలో ఉంటే పారిశుధ్య కార్మికులు మాత్రం తొలికోడి కూయకముందే మేల్కొని తమ విధులు నిర్వహిస్తుంటారు. చిమ్మ చీకట్లో మేల్కొని చీపుర్లు చేతపట్టి, తట్ట, పార నెత్తిన బెట్టుకుని విధుల్లోకి మురుగు చెత్తను తొలగించడానికి ముందుకు సాగుతారు. వీధులన్నీ శుభ్రంగా ఊడుస్తారు. కాలువలలో, మ్యాన్‌హోల్స్‌లో మురుగును సైతం ఓర్పుతో తొలగిస్తూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడానికి వారంతా మురుగు పూసుకుంటారు. కంటోన్మెంట్ బోర్డుతో పాటు జీహెచ్‌ఎంసీకి సంబంధించిన పారిశుధ్య కార్మికులు వేల సంఖ్యలో పనిచేస్తున్నారు. ప్రతిరోజు పట్టణంలోని వీధులు, మురికికాలువలు శుభ్రం చేయడం వీరి విధి. ఈ క్రమంలో తెల్లవారక ముందే చలికి వణుకుతూ విధులు నిర్వహిస్తుంటారు. కుక్కలు, పందులు లాంటి జీవులు చనిపోయి దుర్గంధం వెదజల్లుతున్నా ముక్కు మూసుకుని తొలగిస్తారు. ఒక్క మాటలో చెప్పాలంటే స్వచ్ఛ్ భారత్, స్వచ్ఛ్ సర్వేక్షన్ కార్యక్రమాలకు నిదర్శనం.. ఈ పారిశుధ్య కార్మికులే అనడానికి నిదర్శనం.

### నిబంధనలు బుట్టదాఖలు

పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే క్రమంలో పారిశుధ్య కార్మికులు అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారు. వారికి సరిపడు సబ్బులు, కొబ్బరినూనె అందించాలి. దుమ్ముధూళి నుండి కాపాడుకోవడానికి మాస్కులు, గ్లౌజ్‌లు అందజేయాలి. కనీసం యేడాదికి రెండుసార్లు వైద్యపరీక్షలు చేయించాలి. రెండు జతల దుస్తులు, చెప్పులు అందజేయాలి. కానీ ఈ నిబంధనలు పూర్తిస్థాయిలో అమలవుతున్న దాఖలాలు ఎక్కడా కనిపించవు. రెండు మూడు నెలలకొకసారి వేతనం వస్తుండడంతో కుటుంబాలు నడవక పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అలాగే వీరికి ఉద్యోగ భద్రత కూడా లేదు. కాలుష్య వాతావరణంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యాలకు గురై మృత్యువాత పడిన కార్మికులు ఎందరో ఉన్నారు. మనకళీకటిలో చెత్తను తీస్తున్న క్రమంలో ప్రమాదాలకు గురై మృతిచెందిన కార్మికుల కుటుంబాలు రోడ్డున పడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కొన్నిరోజుల క్రితం బోయిన్‌పల్లిలోని తోకట్ట చెరువు అదేవిధంగా సెంటర్ పాయింట్‌లోని పిలిప్స్ గోదాం వద్ద నీక్లలో వ్యర్థాలను తీస్తున్న క్రమంలో కాలుజారి అందులోపడిపోయి మురుగునీటిలో ఊపిరాడక ఇద్దరు పారిశుధ్య కార్మికులు మృతి చెందారు. ఒకరోజు విధుల్లోకి రాకపోతే వీధులన్నీ చెత్త చెదారం దుర్గంధంతో కంపుకొడుతుంటాయి.

### సరిపడా జీతాలు లేవు



మాపై ప్రభుత్వాలకు కనికరం కలగడంలేదు. సరిపడా జీతాలు రాక ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. మా ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకుని మాకు అందించాల్సిన వస్తువులు అందించాలి. మాకు సరిపడే జీతాలు అందిస్తూ ప్రభుత్వాలు ఆదుకోవాలి.

\- రజిత, కార్మికురాలు

### మాకు భరోసా కల్పించాలి



ఎండ, వాన చలిని లెక్కచేయకుండా పనిచేస్తున్న మాకు జీతాలు సకాలంలో అందేలాగా ప్రభుత్వాలు చూడాలి. పశువులు, పందులు, ఎలుకలు కుక్కలు చనిపోతే వాటిని తొలగిస్తున్నాం. మురుగును తొలగిస్తున్న సమయాలలో మాకు జరగరాని ప్రమాదాలు జరిగితే మా కుటుంబాలకు భరోసా కల్పించడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రులలో ఉచిత వైద్యం అందేలాగా ప్రణాళికలు రూపొందించాలి.

\- బండి శ్రీనివాస్

### పనిముట్లు అందించాలి



పనిలో ఉన్నప్పుడు పారిశుధ్య కార్మికులకు అధికారులు అందించాల్సిన అన్నిరకాల పనిముట్లు మాస్కులు, గ్లౌజ్‌లు, సబ్బులు, చర్మ వ్యాధులు రాకుండా నూనెతో పాటు సంవత్సరానికి రెండుసార్లు వైద్య పరీక్షలు చేయించాలి. మాకు అందించాల్సిన అన్నిరకాల వసతులు అందేలా ప్రభుత్వ అధికారులు చొరవతీసుకోవాలి.

\- శ్రీనివాస్, స్వీపర్

# మహిళల ఉపాధికోసం శిక్షణా కేంద్రాలు : కిషన్ రెడ్డి



కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రాంగోపాల్‌పేట్, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, వారి కాళ్ల మీద వారు నిలబడాలనే ఉద్దేశ్యంతో కుట్టు మిషన్లను అందజేస్తున్నామని కేంద్ర మంత్రి గంగారపు కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ పీజీ రోడ్డులోని ఆర్యవైశ్య అభ్యుదయ సంఘ భవనంలో జేసీఐ అధ్వర్యంలో మహిళలకు 100 కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అనంతరం మంత్రి మాట్లాడుతూ.. యువతకు ఉపాధి కల్పించాలనే ఈ కుట్టు మిషన్లను అందజేశామని, గతంలో అంబర్‌పేట ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రారంభించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఇప్పుడు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి విస్తరించాయన్నారు. పేద మధ్య తరగతి మహిళలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇబ్బంది పడుతున్నారని అలాంటి వారికి ఉద్యోగాలు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. వారి కోసం స్టార్టప్‌లు, ముద్రా రుణాలు ఇతర సహాయ సహకారాలను అందజేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇప్పించి వ్యవసాయంలో వాటిని వాడుతూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు "డ్రోన్ దీదీ" పేరిట నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే 15వేల గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద శిక్షణ ఇచ్చి 15 వేల డ్రోన్లు ఇచ్చామని, అన్ని బ్యాంకులకు కూడా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు ఇచ్చిందని, ముద్ర బ్యాంకు, స్వనిధి యోజన, స్వయం సహాయక సంఘాలకు లక్షల రూపాయల లోన్లు ఇస్తూ ప్రోత్సహిస్తున్నామని వివరించారు. మహిళలకు ఉపాధి అవకాశాలు పెరిగినప్పుడు ఈ సమాజం బాగు పడుతుందని.. ఆ దిశగా మేము చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక, నాయకులు నరేష్‌లతో, జేసీఐ ప్రతినిధులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## నరసింహన్‌కన్నన్‌కు మూడు ప్రతిష్టాత్మక అవార్డులు




అవార్డులు అందుకుంటున్న నరసింహన్ కన్నన్

తిరుమలగిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బొల్లారం ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజిక సంఘ సేవకులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరసింహన్ కన్నన్ మూడు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నారు. సెలబ్రేటింగ్ హ్యూమన్ రైట్స్ డే సందర్భంగా ముంబైలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అంబాసిడర్స్ ఆర్గనైజేషన్, భారత్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రత్న, గ్లోబల్ లీడర్షిప్ అవార్డు - 2024, భారత్ భూషణ్ నేషనల్ అవార్డు 2024 అందుకున్నారు. ఈ సందర్భంగా నరసింహన్ కన్నన్ మాట్లాడుతూ, ఈ అవార్డుల ద్వారా తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌ఏఓ ఫౌండర్ అవినాష్ నకుండే, ఎమ్మెల్యే అరుణ్ ఖాన్, ముంబై పోలీస్ ఏసీపీ సుఖ కపిల్, మిస్ ఇండియా ప్రియా రాయ్, బాలీవుడ్ నటీమణి శ్రావణి గోస్వామి, ఐహెచ్‌ఆర్‌ఏఓ నేషనల్ ప్రెసిడెంట్ అఫ్జహర్ ఖురేషీ పాల్గొన్నారు.

## కుట్టివెల్లోడి ఆస్పత్రి భవన నిర్మాణం వేగవంతం చేయాలి

- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు



కుట్టివెల్లోడి ఆస్పత్రి భవన నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

బౌద్ధనగర్, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలో నూతనంగా నిర్మిస్తున్న కుట్టివెల్లోడి ఆస్పత్రి భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి భవన నిర్మాణపనులను అధికారులు, కార్పొరేటర్లు కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సికింద్రాబాద్ నియోజకవర్గ, సీతాఫల్‌మండి డివిజన్ ప్రజల చిరకాల స్వప్నంగా నిలిచిన ప్రాజెక్టులు తన హయాంలోనే ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆస్పత్రి కొత్త భవనాల నిర్మాణానికి గతంలోనే రూ.12కోట్లు మంజూరు చేయించామన్నారు. నిర్ధారిత వ్యవధిలో, నాణ్యతను పాటిస్తూ పనులు పూర్తిచేయాలని, కార్పొరేట్ ఆస్పత్రికి దీటుగా కుట్టివెల్లోడి ఆస్పత్రి భవనంను తీరిదిద్దాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునీత, ప్రసన్నలక్ష్మీ, మాజీ కార్పొరేటర్ కందినారాయణ, నాయకులు బెజ్జంకి రాజేశ్, టీఆర్‌టీ శేఖర్, మురళీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బోయిన్‌పల్లి క్రీడలకు పుట్టినిల్లు కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్: జంపన



బోయిన్‌పల్లి ప్లే గ్రౌండ్‌లో ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న జంపన ప్రతాప్

బోయిన్‌పల్లి, డిసెంబరు15(ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై ఆసక్తి కనబరుస్తూ స్పోర్ట్స్ పోటీలలో పాల్గొంటే శారీరకంగా ఫిట్‌గా ఉంటారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చీఫ్ పాట్రన్ జంపన ప్రతాప్ అన్నారు. బోయిన్‌పల్లిలోని కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ లో ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్ శరత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో 24 జట్లు పాల్గొంటున్నాయి. ఆదివారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఎస్‌జీఎఫ్ క్రికెట్ టోర్నమెంట్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్లే గ్రౌండ్ బోయిన్‌పల్లి క్రీడలకు పుట్టినిల్లు లాంటిదని అన్నారు. శిక్షణ పొందిన ఎందరో క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ క్రీడలలో రాణించినట్లు పేర్కొన్నారు. ఈ క్రీడా మైదానం కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 30 సంవత్సరాలకు పైగా క్రీడాకారులకు సేవలందిస్తున్నట్లు గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ప్రతి సంవత్సరం లాగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్స్‌ను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. టోర్నమెంట్ నిర్వాహకులు శరత్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే శ్రీగణేష్ పేరుతో నియోజకవర్గ స్థాయిలో ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని అన్నారు. విజేత జట్టుకు రూ.25 వేల నగదు, విన్నర్ ట్రోఫీ రన్నర్స్ జట్టుకు రూ.12 వేలు, రన్నర్స్ ట్రోఫీ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇతర బహుమతులను అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తరుణ్, సాయి, ప్రతాప్, అనిల్, శ్రీకాంత్, బాలు, వరప్రసాద్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ పాలనే బెటర్

- జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.యాదగిరి



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను కలిసిన తెలంగాణ ఉద్యమకారుల సంఘం జేఏసీ ప్రతినిధులు

అడ్డగుట్ట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పాలన కంటే కాంగ్రెస్ పార్టీ పాలన బాగుందని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.యాదగిరి అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ నివాసంలో జేఏసీ ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలన కంటే వందశాతం కాంగ్రెస్ పాలన బాగుందని ఆయన కితాబిచ్చారు. తెలంగాణ తల్లి విగ్రహం తెలంగాణ సాధరణ మహిళలకు ప్రతీకగా ఉందని, ఏనాడూ రైతులు, విద్యార్థుల హాస్టల్, సామాన్యుల సమస్యల్ని సైతం కేసీఆర్ కేటీఆర్, హరీష్‌రావులు పట్టించుకోలేదని విమర్శించారు. మళ్లీ దొరల రాజ్యమే తెచ్చుకుంటామని తెగ సంబర పడుతున్నారని, ఇంకా పదేళ్ల వరకు వాళ్ల ఆటలు సాగవన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం జేఏసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, మహిళా నాయకురాళ్లు సత్తమ్మ, వెంకటలక్ష్మీ, అరుణ, కమల, సరిత, రాజయ్య, ఎల్లమ్మ భవానీ పాల్గొన్నారు.



రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్ డబుల్ బెడ్ రూమ్ ప్రాంగణంలో గౌస్య ఆజం దస్తగిర్ దర్గాలో నిర్వహించిన గార్వీ షరీఫ్ కార్యక్రమంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఫరీద్ ఖాన్, షరీఫుద్దీన్, ఇమ్రాన్, సద్దాం, దేవరాజ్, గణేష్ పాల్గొన్నారు.

\- (రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి)



చిలకలగూడ, శ్రీదేవి థియేటర్, బీజేపీ కార్యాలయం వద్ద పార్టీ నాయకుడు మేకల చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

\- (చిలకలగూడ, ఆంధ్రజ్యోతి)

## దత్తాత్రేయస్వామి జయంతి వేడుకలు



దత్తాత్రేయస్వామి వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మేయర్ బండకార్తీకరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు

బౌద్ధనగర్, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండిలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆదివారం దత్తజయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాజీమేయర్ బండకార్తీకరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు బండ చంద్రారెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొని దత్తాత్రేయస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయచైర్మన్ నాగలీల వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకుడు వీరన్న, కమిటీసభ్యులు శ్రీనివాస్, రాజు, వివేకానంద, ఆనంద్, హరి, మాధవన్, గోపాల్‌దాస్, రాము, పవన్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ దిశ కమిటీ సభ్యుడు కనకట్ల హరి, సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



దత్తాత్రేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న అంబాల రాజేశ్వరరావు తదితరులు

## పోరాటాల ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం

- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్

తార్నాక, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : బలమైన పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తార్నాకలో పలువురు యువకులు తాళ్లపల్లి రాజు ఆధ్వర్యంలో సీపీఐ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికై నిరంతరం రాజీలేని పోరాటాలు కొనసాగించేది సీపీఐ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశంలో అనేక రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఉన్నప్పటికీ బడుగు బలహీన వర్గాల ప్రజలు తమకు సమస్య ఎదురయినప్పుడు ఎర్రజెండానే ఆశ్రయిస్తారని తెలిపారు. పేద వర్గాల కోసం ఎర్రజెండా కొనసాగిస్తున్న పోరాటాల పట్ల యువకులు ఆకర్షితులై పార్టీలో చేరడం సంతోషదాయకమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని చేరికలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ నాయకులు కొమురెల్లి బాబు, గౌరీ నాగరాజు, శ్రీహరి, విక్కీ, శ్రీకాంత్, శ్రీధర్, చందు, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ తదితరులు

## పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

అమీర్‌పేట, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అసాధారణ పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఆదివారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ)గ్రూప్-2 మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఎస్‌ఆర్‌నగర్‌లోని ఆదర్శ్ కళాశాలలో ఉదయం 10గంటలకు ప్రారంభమైన మొదటి షిఫ్ట్ పరీక్షలు మధ్యాహ్నం 12.30కు ముగిశాయి. రెండవ షిఫ్ట్‌లో 3 గంటలకు ప్రారంభమైన పరీక్షలు సాయంత్రం 5.30 గంటలకు ముగిశాయి. ఇక్కడి సెంటర్‌లో మొత్తం 450 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఈ సెంటర్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వెస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ క్రిష్ణగౌడ్ ఎస్ఆర్‌నగర్ ఏసీపీ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి సాయంత్రం వరకు పర్యవేక్షించారు. పరీక్షల అనంతరం పేపర్లను పటిష్ట బందోబస్తు నడుమ (టీజీపీఎస్సీ) కార్యాలయానికి తరలించారు. ఆది, సోమవారాల్లో 1,368 కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు 5,51,847 మంది పరీక్షలు రాస్తున్నారు. 873 పోస్టులకు రెండేసి సెషన్లలో రెండు రోజుల్లో నాలుగు పేపర్లలలో ఈ పరీక్షలు జరుగుతాయని ఉదయం సెషన్‌లో 9.30, మధ్యాహ్నం సెషన్‌లో 2.30 లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు రావాలని లేదంటే గేట్లును మూసివేస్తామన్నారు.